సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



బదిలీలకు పకడ్బందీగా కసరత్తు
ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీలకు ఆయా శాఖల అధికారులు పకడ్బందీగా కసరత్తు చేయాలని డీఆర్‌ఓ ఆదేశించారు. - 8లో



ఆర్‌ఎంపీ క్లినిక్స్‌పై దాడులు
పలమనేరు నియోజకవర్గంలోని పలు ఆర్‌ఎంపీల క్లినిక్స్‌పై గురువారం జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు దాడులు చేశారు. - 8లో



మాకు జీవనాధారం కల్పించండి
'సార్..! మాకు చెక్ వద్దు ..జీవనాధారం కల్పిస్తే చాలు' అని ఓ మృతురాలి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. - 8లో

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు
- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో పింఛన్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబర్ నెలకు సంబంధించి ఎన్టీఆర భరోసా పింఛన్లను ఈ నెల 31న పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఆ రోజున పింఛన్లు అందని వారికి సెప్టెంబర్ 2న ఇవ్వనున్నట్లు తెలియజేశారు.

ప్రభుత్వ భూముల్ని టీడీపీ నేతలు కబ్జా
- ప్రశ్నించిన వీఆర్వోపై దాడి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గుత్తర్లపల్లె గ్రామస్తులు

గుడుపల్లె: టీడీపీ నాయకుల ఆక్రమణల నుంచి ప్రభుత్వ భూములకు విముక్తి కల్పించాలని గుత్తర్లపల్లె గ్రామస్తులు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని కోరారు. గురువారం కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని గుత్తర్లపల్లె వాసులు కలెక్టర్‌కు టీడీపీ నేతల ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. తమ మండలంలోని నక్కనపల్లె గ్రామ రెవెన్యూకు సంబంధించిన సర్వే నంబర్ 62లో 15.20 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు టీడీపీ నాయకులు నకిలీ పాసు పుస్తకాలు సృష్టించి, కబ్జా చేసి, అనుభవిస్తున్నారని, తమ ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేసి, హద్దుల్లో రాళ్లు నాటినా, మరుసటి రోజే టీడీపీ నేతలు కబ్జా చేశారన్నారు. ఇది తెలుసుకున్న వీఆర్వో వారిని ప్రశ్నిస్తే.. అతడిపై దాడి చేసి కొట్టారని, వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేసినా నాయకుల ఒత్తిళ్లతో తూతూ మంత్రంగా కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారని నిరసించారు. కలెక్టర్ దీనిపై దృష్టి సారించి ఆక్రమణలకు విముక్తి కల్పించి 15 ఎకరాలను తమ గ్రామంలోని పేదలకు పంపిణీ చేయాలని లేదా ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



కలెక్టరేట్‌లో గిడుగు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : తెలుగుభాష మధురమైనదని డీఆర్‌ఓ పుల్లయ్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యవహారిక భాషకు ఆద్యుడైన గిడుగు రామమ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ, తెలుగుభాష పట్ల ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు అని కీర్తించారు.. డ్వామా పీడీ మాట్లాడుతూ అమ్మ ప్రేమకు అనుభూతి మాతృభాష అని అన్నారు. భాష భావ వ్యక్తీకరణకు పునాదిలాంటిదని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ కులశేఖర్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల వసూళ్లపై దృష్టి
చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్తు బిల్లుల వసూళ్లపై దృష్టి సారించాలని ట్రాన్స్‌కో సీనియర్ అకౌంట్ ఆఫీసర్ శ్రీనివాసులు కోరారు. గురువారం ఈఈలతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. బదిలీల హడావిడిలో పడి కలెక్షన్లను నిర్లక్ష్యం చేయరాదన్నారు. గడువు సమీపిస్తున్న తరుణంలో వినియోగదారులకు బిల్లులు చెల్లించాలని తెలియజేయాలన్నారు. వందశాతం బిల్లుల వసూలు లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు.

చట్టాలకు మరింత పదును పెట్టాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి, దారుణ హత్య ఉదంతం సభ్యసమాజం తలదించుకునే ఘటన. పనిచేసే ఆస్పత్రిలోనే రక్షణ లేకపోవడంపై దారుణం. యావత్తు దేశాన్నీ ఇది కుదిపేసింది. వైద్య వృత్తిలో అందరి ప్రాణాలు కాపాడాలని తపించే వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా? ఇలాంటి దారుణ కృత్యాల నుంచి కాపాడడంలో ప్రస్తుత చట్టాలు సరిగా లేవనే భావన వ్యక్తమవుతోంది. కోల్‌కతా ఘటనతో వైద్యుల్లో ఒకింత భయం, ఆందోళన నెలకొంది. రాత్రిపూట వైద్య సేవలు అందించేందుకు సంశయించాల్సి వస్తోంది. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వాలు సీరియస్‌గా స్పందించాలి. అవసరమైన చట్టాలకు మరింత పదును పెట్టాలి.

– ధనుష్ తేజ, జూనియర్ డాక్టర్, చిత్తూరు



పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలి



వైద్యులు అభద్రతా భావంతో పనిచేసే పరిస్థితులు లేకుండా చూడాలి. అప్పుడే ఒత్తిడి లేకుండా పనిచేయగలుగుతారు. రోగుల ప్రాణాలు కాపాడేందుకు కృషి చేస్తారు. అలాంటి వైద్యులపై దాడులు చేయడం సరికాదు. ప్రజల్లో మార్పు రావాలి. కోల్‌కతా లాంటి ఘటనలు జరగకుండా మహిళా వైద్యులకు పనిచేసే చోట పూర్తిస్థాయి భద్రత కల్పించాలి. ఏదైనా ఘటన జరుగుతుంటే ప్రజలు ప్రేక్షకపాత్ర వహించకుండా అన్యాయాన్ని ఖండించాలి. ప్రభుత్వాలు కూడా తక్షణమే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– నిఖిలా హదస్సా, జూనియర్ డాక్టర్, చిత్తూరు

అడవి రోదిస్తోంది..!



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇసుక, మట్టి దందా పెచ్చరిల్లింది. ఇప్పుడా కోవలోకి వన్యప్రాణుల వేట కూడా చేరింది. పలమనేరు కౌండిన్య అడవిలో వన్యప్రాణుల వేటగాళ్లు కూడా రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా వన్యప్రాణులను చంపి మాంసం విక్రయిస్తున్నారు. వన్యప్రాణుల మాంసం అంటే..ఆ రుచే వేరబ్బా!? అని లొట్టలు వేసుకునే తినే మాంసంప్రియులకు కొదువ లేదు. ఈ యావే వేటగాళ్లకు కాసులు కురిపిస్తోంది. అడవి జంతువు డిమాండ్‌ను బట్టి మాంసానికో రేటు ఫిక్స్ చేసి జేబులు నింపుకుంటున్నారు. ఫలితంగా వన్యప్రాణుల వేట అధికమైంది. గతంలో వేటగాళ్ల కాల్పులకు వన్యప్రాణులే కాదు; అమాయకులు సైతం బలైన సంఘటనలూ ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలోని అటవీ సమీప గ్రామాల్లో దుప్పి, అడవిపంది, అడవికోళ్లు, పలు రకాల పిట్టలు, కుందేళ్లు, ఉడుము మాంసం సాధారణంగా చికెన్ దొరికినంత సులభంగా లభిస్తోంది. ఓ వైపు స్మగర్లు యథేచ్ఛగా ఎర్రచందనం చెట్లను నరికివేస్తుండటం, మరోవైపు తనపై ఆధారపడి జీవిస్తున్న వన్యప్రాణుల్ని వేటగాళ్లు హతమారుస్తుండడంతో అడవి తల్లి మౌనంగా రోదిస్తోంది.

- కౌండిన్యలో పెచ్చు మీరుతున్న వన్యప్రాణుల వేట
- గుట్టుగా మాంసం విక్రయాలు
- పెంపుడు జంతువులు, పశువులు సైతం బలి
- కూటమి రాకతో రెచ్చిపోతున్న వేటగాళ్లు
- ఫారెస్ట్ సిబ్బందిపై సైతం దాడులు
- తమిళనాడు నుంచి నాటు తుపాకులు

పలమనేరు: ఉమ్మడి జిల్లాకు సంబంధించి భౌగోళిక అటవీ ప్రాంతం 15,151 చదరపు కిలోమీటర్లు. ఇందులో ఏడు ప్రాంతాల్లో మాత్రం అతి దట్టమైన అడవులు, 29 ప్రాంతాల్లో దట్టమైన అడవులున్నాయి. ఓపెన్ ఫారెస్ట్‌గా 1,463 చదరపు కిలోమీటర్లు, మిగిలినవి చిట్టడవులుగా వ్యాపించి ఉన్నాయి. జిల్లాలోని శేషాచలం, కౌండిన్య అడవులు వన్యప్రాణులకు నిలయంగా ఉన్నాయి. ఇన్నాళ్లూ కాస్త తక్కువగా సాగిన వన్యప్రాణుల వేట కూటమి ప్రభుత్వం రాకతో ఊపందుకుంది. అడవుల్లో తరచూ నాటు తుపాకుల మోత, వేటగాళ్ల ఉచ్చులు, నల్లమందు ఉండలకు వన్యప్రాణులు, రకరకాల పక్షులు బలవుతున్నాయి. జిల్లాలోని పశ్చిమ భాగంలో కౌండిన్య అభయారణ్యం బంగారుపాళ్యం నుంచి పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో అటు తమిళనాడు, ఇటు కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల వరకు సుమారు 357 చదరపు కిమీ మేర వ్యాపించి ఉంది. ఈ అడవిలో 79 ఏనుగులు, ఏడు వేలకు పైగా జింకలు, ఎనిమిదివేల దుప్పులు, కణుతులు, ఎలుగుబంట్లు, కొన్ని హైనాలు, చిరుతలు ఉన్నాయి. వీటితో పాటు అడవి గొర్రెలు, కుందేళ్లు, బావురు పిల్లులు, ఉడుములు, నక్కలు, నెమళ్లు, ఇవిగాక 40 రకాల క్షీరదాలు,160కి పైగా పలురకాల పక్షులు, అరుదైన కొంగలున్నాయి.

ఇక్కడా 'వేటాట'..!

భాకరాపేట (చిన్నగొట్టిగల్లు): చంద్రగిరి నియోజకవర్గంలోని పలు చోట్ల వన్యప్రాణుల వేట గుట్టుగా సాగుతోంది.

చిన్నగొట్టిగల్లు మండలం : దేవరకొండ, చిట్టేచెర్ల, దీన్‌దార్లపల్లె, భాకరాపేట, ఎగవూరు, దిగవూరు పంచాయతీల్లో శేషాచలం అటవీ సరిహద్దుల్లో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో వన్యప్రాణులను వేటాడుతున్నారు.

ఎర్రావారిపాళెం మండలం : నెరబైలు, కమళ్ల, చింతగుంట, బోడేవాండ్లపల్లె, యల్లమంద, ఉస్తికాయలపెంట, తలకోన ప్రాంతాలు

చంద్రగిరి మండలం : రంగంపేట, కొటాల, భీమవరం, నారావారిపల్లె తదితర గ్రామాలు



వేటగాళ్ల చేతిలో మృతిచెందిన దుప్పి(ఫైల్)

పాకాల మండలం : వల్లివేడు, గానుగపెంట, వడ్డేపల్లె సమీప అడవుల్లో వన్యప్రాణులను వేటాడుతున్నారు. కొన్ని గ్రామాల్లోనే నాటు తుపాకులు తయారు చేయడంలో ఆరితేరిన వేటగాళ్లు కూడా ఉన్నట్టు తెలిసింది. వీరికి పీలేరు, తిరుపతి, చిత్తూరు, బంగారుపాళెం, కలకడ, రాయచోటి ప్రాంతాల నుంచి తూటాలు, నల్లమందు దొరుకుతోంది.

నాటుబాంబు ఉంటలతో వేట!

చౌడేపల్లె: మండలంలోని పెద్దకొండామర్రి. చెడుగుట్లపల్లె, కొలింపల్లె, మాదంవారిపల్లె, షికారిపాళ్యం, సీజేఎఫ్ఎస్ కాలనీ, బండమీదపల్లె, చుక్కవారిపల్లె, సింగిరిగుంట, మడుకూరు, దుర్గసముద్రం, తదితర గ్రామాలు అటవీ సమీప ప్రాంతాల్లో ఉండడంతో వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోంది. వన్యప్రాణుల వేటకు వినియోగించిన నాటు బాంబు ఉండల వల్ల చివరకు పెంపుడు కుక్క, పాడిఆవులు మృతి చెందిన ఘటనలూ ఉన్నాయి. మేతకోసం వెళ్లిన ఆవులు ఆ ఉంటలను కొరికి మృత్యువాత పడిన ఉదంతాలు తెలిసిందే. గతంలో బోయకొండ, చుక్కావారిపల్లె పరిసర ప్రాంతాల్లో ఓ దుప్పి వేటగాళ్ల తూటాలకు బలైనట్లు తెలిసింది.



చౌడేపల్లె: అటవీ ప్రాంతంలో వేటగాళ్లు ఏర్పాటు చేసిన నల్లమందు ఉంట



పలమనేరు: వేటగాళ్లు అడవిలో ఉంచిన నల్లమందు

శేషాచలం అటవీ ప్రాంతం ఉన్న పెద్ద ఉప్పరపల్లె, సోమల, తుంబకుప్పం, తుంబపాళ్లం, భాకరాపేట, యర్రావారిపాళెం అడవుల్లోనూ పలు వన్యప్రాణులున్నాయి.

వేట నిత్యకృత్యం
అటవీశాఖ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వన్యప్రాణులకు మాత్రం రక్షణ లేకుండా పోతోంది. ముఖ్యంగా పలమనేరు, కుప్పం, పుంగనూరు, చంద్రగిరి, పూతలపట్టు నియోజకవర్గాల్లోని అడవుల్లో వేట నిత్యకృత్యమైంది. దుప్పులు, అడవిపందుల తదితరాల కోసం వేటగాళ్లు నాటు తుపాకులు, నల్లమందు బాంబులు, ఉరులతో నిరాటంకంగా వేటాడుతున్నారు. నాటుతుపాకులను తయారు చేసుకున్న 'పచ్చ వేటగాళ్లు' వేటను రెండునెలలుగా ముమ్మురం చేశారు.

అడవి మాంసానికి డిమాండ్
జిల్లాలోని అడవులకు ఆనుకుని దాదాపు 360 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లోని కొందరు వన్యప్రాణుల వేటనే జీవనోపాధిగా మార్చుకున్నారు. నాటు తుపాకులతో యువత సైతం వేటమీద వ్యామోహంతో అడవిబాట పడుతోంది. మరికొందరు నాటు బాంబుల ఉండలు తయారు చేసి, వాటిపై వన్యప్రాణులకు ఇష్టమైన పదార్థాలతో ఎరగా వేసి హతమారుస్తున్నారు. ఆహారంగా భ్రమించి వీటిని వన్యప్రాణులు కొరిన వెంటనే పెద్ద శబ్దంతో పేలి, తలలు ఛిద్రమై వన్యప్రాణులు బలవుతున్నాయి. ఇలా వేటాడి వాటి మాంసాన్ని గుట్టుగా విక్రయిస్తున్నారు. అడవుల్లో వన్యప్రాణులు సంచరించే ప్రాంతాలను గుర్తించి కమ్మీలు, వైర్లతో తయారు చేసిన ఉచ్చులతో సైతం హతమారుస్తున్నారు. ఈ వేటగాళ్ల కారణంగా ఊరకుక్కలు, అడవిలో మేతకెళ్లే పశువులు, మేకలు తరచూ బలవుతూనే ఉన్నాయి. పశువుల కాపరులు సైతం ఏమాత్రం ఆదమరచినా నాటు బాంబు ఉండలపై అడుగు పెట్టినా ఇక వారికి నూకలు చెల్లినట్లే! గత ఆరేళ్ల కాలంలో వేటకెళ్లిన వేటగాళ్లు సైతం పదిమంది వరకూ మృతి చెందారు.

అంతా సెల్‌ఫోన్లతోనే వ్యాపారం!
కేవలం సెల్‌ఫోన్లతోనే వేటమాంసం వ్యాపారం సాగుతోంది. మాంసం ఫొటోలను వాట్సాప్ చేసిన వెంటనే ఎవరికి ఎన్ని కిలోలు కావాలో ఆర్డర్ తీసుకుంటున్నట్టు సమాచారం. తర్వాత జీపే, ఫోన్‌పేలోకి డబ్బులు తీసుకుంటున్నట్టు తెలియవచ్చింది. దీంతో ఆర్డర్ ఇచ్చిన వ్యక్తికి గుట్టుగా మాంసాన్ని చేరుతోంది. ప్రస్తుతం వేటమాంసానికి డిమాండ్ పెరగడంతో వాటి ధర పెంచేశారు. దుప్పిమాంసం కిలో రూ.350, అడవిపంది రూ.300, అడవికోడి రూ.350, ఉడుము రూ.600, జత పక్షులు రూ.270, జింక రూ.500గా అమ్మకాలు సాగుతున్నట్టు సమాచారం. కొందరు వేటగాళ్లు అడవిలోనే కావాల్సిన వారికి మాంసాన్ని వండిపెడుతున్నట్టు తెలియవచ్చింది.

- ఈ మధ్యన పలమనేరు మండలం కొలమాసనపల్లె ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పరమేష్‌పై వేటగాళ్ల బృందం కత్తులతో దాడి చేసింది. వేటగాళ్ల సమాచారం అందుకుని వారిని పట్టుకునేందుకు అడవికి వెళ్లినందుకు ఆయనకు దక్కిన ఫలితమిది. తాము పట్టుబడితే జైలుకేనని భావించి ఆయనే వేటాడబోయారు. అదృష్టవశాత్తు ఎలాగో వారి బారి నుంచి తప్పించుకుని బతుకుజీవుడా అని ఆయన పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు.
- ఇటీవలే గుడిపాల మండలంలోని చిత్తపారలో అడవిపందుల వేటకు తయారు చేసి ఉంచిన 19 నాటు బాంబు ఉండలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి కారణమైన భాస్కర్ అనే వేటగాడిని అరెస్ట్ చేశారు.
- ఇటీవలే పుంగనూరు మండలంలో షికారిపాలెంకు చెందిన అంకయ్య అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి నుంచి నాటు తుపాకీ, నక్షత తాబేలు స్వాధీనం చేసుకున్నారు.

ఫారెస్ట్ సిబ్బందిపై దాడులు
ఈ మధ్యన పలమనేరు మండలంలోని కొలమాసనపల్లెకు చెందిన 15మంది వేటగాళ్లు అడవిలో వేటకు వెళ్లినట్టు సమాచారం అందడంతో అక్కడి సెక్షన్ ఆఫీసర్ పరమేష్ హుటాహుటిని వెళ్లి వారిని అడ్డుకున్నారు. దీంతో వేటగాళ్లు ఎదురుదాడికి దిగారు. ఆయన్ను కొట్టి, గాయపరిచి, కత్తితో గొంతు కోసేందుకు యత్నించారు. ఎట్టకేలకు ఆయన వారి బారి నుంచి తప్పించుకుని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకూ నిందితులను పట్టుకోలేదు. ఇలాంటి సంఘటనలు కూటమి అధికారంలోకి వచ్చాక అడవుల్లో పరిపాటిగా మారాయి. ఫారెస్ట్ అధికారులకు వేటగాళ్లు ఏమాత్రం బెదరడం లేదు.



పుంగనూరులో వేటగాడిని అరెస్ట్ చేసి స్వాధీనం చేసుకున్న నక్షత్ర తాబేలు, నాటుతుపాకీ (ఫైల్)

స్థానికంగానే నాటు తుపాకులు
ఎన్నికల సమయంలో పోలీసులు గ్రామాల్లో దాడులు చేసి పెద్ద సంఖ్యలో నాటు తుపాకులు స్వాధీనం చేసుకుంటూనే ఉన్నారు. కానీ మళ్లీ వేటగాళ్లకు నాటు తుపాకులు ఎలా వస్తున్నాయనే దానిపై పోలీసులు దృష్టి సారించడం లేదు. నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలతో పాటు పొరుగునే ఉన్న తమిళనాడులో రూ. 5వేలిస్తే నాటు తుపాకీ దొరుకుతోంది! నాటు తుపాకీకి అవసరమైన ట్రిగ్గర్, బ్యారల్, గార్డ్, వాలా కమ్మీలు వేలూరులో లభిస్తుండడంతో వీటిని తెచ్చుకుని స్థానికంగానే తుపాకులను తయారు చేసుకుంటున్నారు. ఇక నల్లమందు, గుండ్లు సైతం పేర్నంబట్, గుడియాత్తంలలో దొరుకుతున్నాయి. వేటగాళ్ల నాటు తుపాకుల కారణంగా ఇప్పటికే ఈ ప్రాంతంలో కొందరు ప్రాణాలు కోల్పోయినా అటవీ అధికారులు కూటమి వేటగాళ్ల ఆగడాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా డీఎఫ్‌ఓ స్పందించి వన్యప్రాణుల వేటగాళ్ల భరతం పట్టాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా అడవిని చెరబడుతున్న వారిపై ఓ కన్నేసి ఉంచాలని పలువురు కోరుతున్నారు.



పలమనేరు: వేటగాళ్ల నల్లమందు ఉంటకు దవడ పేలిన పశువు(ఫైల్)



చౌడేపల్లె: నల్లమందు ఉంట కొరికి మృతి చెందిన పెంపుడు కుక్క (ఫైల్)

ట్రాన్స్‌కో.. బదిలీల ఖోఖో


గతంలో ట్రాన్స్‌కో ఉద్యోగుల బదిలీల్లో ప్రజా ప్రతినిధుల ప్రమేయం పెద్దగా ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివిధ శాఖల్లో బదిలీ ప్రక్రియ కొత్త పుంతలు తొక్కాయి. బేరసారాలు, సిఫార్సు లేఖల జోరు పెరిగింది. ప్రభుత్వం సిఫార్సులకు ప్రాధాన్యత ఇస్తుండడంతో నాయకుల వద్దకు పరుగులు తీస్తున్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్ల మొదలుకుని అధికారుల వరకు అందరూ ఇదే బాట పట్టారు. సిఫార్సు లేఖలతో దరఖాస్తు చేస్తున్నారు. ఫలితంగా పోటీ పెరిగింది.

- పనిచేస్తున్న ప్రాంతంలోనే ఉండేందుకు కొందరి యత్నాలు
- అధికారులపై కూటమి నేతల ఒత్తిళ్లు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కోలో కూడా బది'లీల'కు రంగం సన్నద్ధమవుతోంది. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారికి బదిలీలకు అర్హులని ప్రభుత్వం ప్రకటించింది. అయితే గత ప్రభుత్వం ముద్ర ఉన్న అధికారులకు ఐదేళ్ల కాలం ఒకేచోట సర్వీసు పూర్తయినా కోరిన చోట పోస్టింగ్ ఇవ్వడం లేదు. అదే కూటమి ప్రజాప్రతినిధులు అండ ఉన్న వారికి అదే స్థానంలో ఉంచడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒకే ప్రాంతంలో ఐదేళ్ల సర్వీసు పూర్తయిన ఉద్యోగుల జాబితాను శనివారం ప్రకటించారు. కానీ బుధవారం సర్కిల్ పరిధిలో ఐదేళ్లు పూర్తి చేసిన వారిని కలుపుతూ మళ్లీ జాబితా సవరించారు. రెండురోజుల్లో బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని తెలియవచ్చింది. ఎవరికెవరికి స్థాన చలనం కలుగుతోందని చర్చకు తావిచ్చింది.

బదిలీల లిస్టు సిద్ధం?
ప్రస్తుతం సర్కిల్ పరిధిలో ఐదేళ్ల సర్వీసు ప్రాతిపదికన సర్కిల్ పరిధిలో ఎస్‌ఈలు నలుగురు, ఈఈలు 17 మంది, డీఈలు 32 మంది, ఏఈలు 31 మంది, సీజీఎం ఇద్దరు కాగా, మిగిలిన ఉద్యోగులు 131 మంది ఉన్నారు. వీరిలో పలువురు ఉన్నత స్థాయి ఉద్యోగులు పదేళ్లకు పైగా ఇక్కడే కొనసాగుతున్నారు. వీరికి స్థానచలనం ఉంటుందా, లేదా. అనేది వేచిచూడాల్సి ఉంది.

సిఫార్సు అయితే ఓకే..!



తిరుపతిలోని సీఎండీ కార్యాలయం

ఒకే స్థానంలో ఐదేళ్ల సర్వీసు ముగిసినా కూటమి ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నవారు పైరవీలకు తెరదీశారు. తమను అదే స్థానంలో ఉంచేలా పావులు కదుపుతూ సీఎండీపై నేతలతో ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. కొందరు అధికారులు పక్క జిల్లాకు వెళ్లినట్లే వెళ్లి తిరిగి ఇక్కడికి రావాలని ప్రయత్నాలు చేయడం పరిపాటిగా మారుతోంది. స్పౌజ్ వర్కింగ్, ఉమెన్ కోటా..ఇలా వివిధ కారణాలు చూపుతూ తాము పనిచేస్తున్న చోటు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. ఏళ్ల తరబడి ఒకేచోట తిష్ట వేసి కింద స్థాయి ఉద్యోగులు, సిబ్బందిపై వేధింపులకు పాల్పడుతుండటంతో ఈసారైనా వీళ్లకు స్థాన చలనం కలగాలి దేవుడా! అని దిగువ స్థాయి ఉద్యోగులు మొక్కుతున్నారు.

ముద్ర
- గత ప్రభుత్వం ముద్ర పడిన కొందరు అధికారులకు బదిలీల్లో ప్రాధాన్యత ఇవ్వడం లేదు. దీంతో కొందరు పక్క జిల్లాలకు, మరికొందరు ఇచ్చిన ప్రాంతానికి వెళ్లడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.
- తిరుపతిలో ఈఈలు ఇద్దరు, నగరిలో ఒకరు, చిత్తూరు రూరల్ ఒకరు ఉన్నారు. ఇక తిరుపతి, నగరి, చిత్తూరు అర్బన్‌లో ఇద్దరేసి డీఈలకు గత ప్రభుత్వ ముద్ర వేశారు. బదిలీ చేస్తే వీరికి ఎక్కడికి వేస్తారు? అని ఉద్యోగుల్లో చర్చ మొదలైంది.

క్లుప్తంగా

చిత్తూరులో అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- రెండు వారాల్లోనే చోరీ కేసు ఛేదన
- బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సాయినాథ్, సీఐ జయరామయ్య మీడియాకు తెలిపిన వివరాలు.. ఈనెల 15న స్థానిక కట్టమంచికి చెందిన మునికృష్ణ పనుల నిమిత్తం బయట ప్రాంతానికి వెళ్లాడు. ఇదే అదునుగా ఆతడి ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో చోరీకి పాల్పడింది ఉత్తరాది వాసులని ప్రాథమికంగా గుర్తించారు. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన నసీమ్ షఫీ (25), జన్‌షేర్ పట్టం(35)ను చిత్తూరులో అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.8.50 లక్షల విలువ చేసే 140 గ్రాముల బంగారు, 350 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంతో ప్రతిభ కనబరచిన ఎస్‌ఐ లక్ష్మీకాంత్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

కఠిన చట్టాలు చేయాలి



చదువుకుంటున్న, ప్రాక్టీసు చేస్తున్న డాక్టర్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. వాటిని పకడ్బందీగా అమలు చేయాలి. సమాజంలో వైద్యులకు తగిన గౌరవం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే. ప్రజలు కూడా డాక్టర్లు తమ కోసమే పనిచేస్తున్నారనే విషయం గ్రహించాలి. కోల్‌కతా ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నా. ఇలాంటివి మరోసారి జరగకుండా చూడాల్సిన అవసరం ఉంది.

– సంఘమిత్ర, జూనియర్ డాక్టర్, చిత్తూరు



ప్రత్యేక రక్షణ చర్యలు అవసరం



రోగాలతో బాధపడే వారికి మరో జన్మనిచ్చే వారు డాక్టర్లు. కోల్‌కతా ఘటన చాలా బాధాకరం. ఇలాంటివి వైద్యులకే కాదు ఇంకెవరికీ జరగకూడదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలి. కఠిన చట్టాలు తీసుకొచ్చి అమలు చేస్తే నిందితులకు హెచ్చరికగా ఉంటుంది. ఇలాంటి దారుణాలకు పాల్పడిన వారిని అరెస్టు చేసి చాలా కఠినంగా శిక్షించాలి.

– అంజలి, జూనియర్ డాక్టర్, చిత్తూరు

మాట తప్పని పెద్దిరెడ్డి కుటుంబం

- 30 రోజుల్లో బాధితులకు ఆర్థిక సాయం
- మాజీ ఎంపీ రెడ్డెప్పకు కారు, మరొకరికి ద్విచక్రవాహనం


రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి చేతులు మీదుగా స్కార్పియోను అందుకుంటున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప


పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కలిసిన మాజీ ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గంలో తెలుగుదేశం నాయకులు దాడుల్లో నష్టపోయిన వారిని ఆదుకుంటామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి సదుంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఇచ్చిన హామీని నెరవేర్చారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ కేవలం 30 రోజుల్లోనే బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. తప్పుడు కేసుల్లో అరెస్ట్ అయిన వారికి అండగా ఉంటూ కేసులకు న్యాయవాదులను నియమించారు. అలాగే పంటలు, ఇళ్లు నష్టపోయిన వారికి సాయంతో పాటు వాహనాలు నష్టపోయిన వారికి నూతన వాహనాలనూ అందజేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎంపీ రెడ్డెప్పకు చెందిన రెండు కార్లను ధ్వంసం చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, ఎంపీ రూ.30 లక్షల విలువ చేసే నూతన స్కార్పియోను మాజీ ఎంపీకి, అలాగే మహబూబ్‌బాషాకు ద్విచక్రవాహనాన్ని అందజేశారు. ఇవికాక పుంగనూరు, సోమల, పులిచెర్ల, రొంపిచెర్ల, చౌడేపల్లెలోని బాధితులకు భారీ మొత్తంలో ఆర్థిక సహాయం అందజేశారు. గత నెల 18న పుంగనూరులో రెడ్డెప్ప ఇంటికి వచ్చిన మిథున్‌రెడ్డిపై టీడీపీ నాయకులు దాడులు చేశారు. ఇల్లు ధ్వంసం చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి వాహనాలతో సహా రెడ్డెప్పకు చెందిన స్కార్పియోను తగులబెట్టి కాల్చివేశారు. ఫార్చునర్ వాహనాన్ని ధ్వంసం చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కారును అందుకున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుటుంబానికి ఎంతో పెద్దమనసని కృతజ్ఞతలు తెలిపారు.

బ్రహ్మోత్సవ కరపత్రాల ఆవిష్కరణ


బ్రహ్మోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఎం, దేవదాయశాఖ కమిషనర్ తదితరులు

కాణిపాకం: స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లు, కరపత్రాలను విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. సెప్టెంబర్ 7 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, సీఎంను వేదపండితులు ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మురళీమోహన్, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, ఆలయ ఈఓ కె.వాణి చంద్రబాబు నాయుడుకు ఆలయ అర్చక వేద పండితులతో ఆశీర్వచనం పలికించారు. స్వామివారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు చిత్రపటం అందజేశారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ

- మేదినీ దేవికి ప్రత్యేక పూజలు


తిరు మాడ వీధుల్లో ఊరేగుతున్న సేనాధిపతి

కార్వేటినగరం: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం పవిత్రోత్సవాలు అంకురార్పణ కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. ఉభయ దేవేరులతోపాటు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం అంకురార్పణకు మునుపు పుట్టమన్నుతో మేదినీ దేవిని ప్రతిష్ఠించి, అమ్మవారికి పట్టు వస్త్ర సుగంధ పుష్పాలతో అలంకరించి వేద పండితులు పూజార్చన, ఇతర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి వివిధ వైదిక కార్యక్రమాల అనంతరం విశ్వక్సేనుని సేనాధిపతి ఉత్సవరులను ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. రాత్రి 8.30 గంటలకు ఏకాంత సేవలో స్వామివారు పవళించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ సోముశేఖర్, ఆలయ అధికారి సురేష్ కుమార్, షరాబ్ సురేష్‌బాబు, వేద పండితులు దాశరథి, గోపాలస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలువురు మున్సిపల్ కమిషనర్ల బదిలీ

చిత్తూరు అర్బన్: జిల్లాలో పనిచేస్తున్న పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేసి ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ధర్మవరం మునిసిపాలిటీ సహాయ కమిషనర్ కేవీ మధుసూదన రెడ్డిని పుంగనూరుకు, ఇక్కడ ఉన్న నరసింహ ప్రసాద్‌ను రాష్ట్ర డీఎంఏ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. నెల్లూరు కార్పొరేషన్ లోన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ.ప్రసాద్‌ను చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్‌గా, వైఎస్సార్ జిల్లా కడప కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కేవీ కష్టారెడ్డిని నగిరి మున్సిపల్ కమిషనర్‌గా, ఇక్కడ ఉన్న ఎం.మంజునాథ గౌడ్‌ను నందికొట్కూరు మున్సిపల్ మేనేజర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

సూపర్ సిక్స్‌కు సున్నం పెట్టిన చంద్రబాబు

- మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి


మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పాలసముద్రం : కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌కు సున్నం పెట్టి రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిందని, రాష్ట్రంలో శాంతిభద్రతలను పోలీస్ యంత్రాంగం గాలికొదిలేసిందని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి విమర్శించారు. గురువారం పాలసముద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ పథకాలతో ఊదరగొట్టిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తడం లేదని, అసెంబ్లీలో ఆయన మాటలు చూస్తుంటే పథకాలకు మంగళం పాడక తప్పదనేలా సంకేతాలిచ్చినట్లు ఉందన్నారు. దీనిపై కూటమి భాగస్వామి పవన్‌కల్యాణ్ పెదవి విప్పడం లేదని మండిపడ్డారు. సంపద సృష్టించడం అంటే అప్పులు చేయడమేనా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలతో చంద్రబాబు రాక్షస, ఆటవిక పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. అంతేకాకుండా చంద్రబాబు ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా ఓటాన్ అకౌంట్‌కు వెళ్లిందన్నారు. హామీలతో రైతులు, నిరుద్యోగులు, మహిళలను పూర్తిగా బాబు దగా చేశారని ఎండగట్టారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, మహేష్‌బాబు, అయ్యప్ప, మాజీ సర్పంచ్ ఆండాలు రవి, ఎంపీటీసీ గోవిందరాజ్, పుత్తూరు కేశవరెడ్డి, పోలయ్య, చిన్నబ్బరాజు, పద్మనాధనాయుడు, లోకిదాస్, గోపాల్, కస్తూరి, సుందరాజు, నరసింహనాయుడు, క్రిష్ణయ్య, మాకయ్య, సుబ్రమణ్యరాజు, మనోహర్, రవి, నరసింహారెడ్డి, తిరుమల, కుమార్, మునస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఐరాల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చెన్నవెంకటంపల్లె వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరసింహులు కథనం.. మండలంలోని చిన్నవెంకటంపల్లె దళితవాడకు చెందిన కె.మునిరత్నం(50) గురువారం రాత్రి వైఎస్.గేటు నుంచి తన స్వగ్రామానికి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా ప్రమాదానికి గురయ్యాడు. ఐరాల మండలం పాతపాళ్యంకు చెందిన సురేంద్ర ద్విచక్రవాహనంలో సొంత పనుల నిమిత్తం చిత్తూరుకు వెళ్లి తిరిగి వస్తూ మునిరత్నంను వేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. సురేంద్రకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే సురేంద్రనూ చికిత్స కోసం తరలించారు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై అధికారుల దాడులు

- పలువురు ఆర్‌ఎంపీలకు నోటీసులు జారీ
- అధికారులతో వాగ్వాదానికి దిగిన ఓ ఆర్‌ఎంపీ

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని పలు ఆర్‌ఎంపీల క్లినిక్స్‌పై గురువారం జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు దాడులు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని గుర్తించి ఆర్‌ఎంపీలకు నోటీసులు జారీ చేశారు. అధికారుల తనిఖీల సమాచారంతో కొందరు క్లినిక్స్ తెరవనే లేదు. 'ఆర్‌ఎంపీ వైద్యం..తీస్తోంది ప్రాణం' శీర్షికతో రెండ్రోజుల క్రితం సాక్షి దినపత్రిక ప్రచురించిన కథనంపై డీఎంఅండ్‌హెచ్‌ఓ స్పందించారు. ఆమె ఆదేశాలతో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ హనుమంతరావు సిబ్బందితో కలసి ఈ దాడులు చేశారు. క్లినిక్స్ ముందు ప్రథమ చికిత్సా కేంద్రాలనే బోర్డులుండానేగానీ డాక్టర్లంటూ రాసుకోవడం చట్టరీత్యానేరమని, అసలు ఆర్‌ఎంపీలకు ప్రిస్కిప్షన్ రాసే అధికారం లేదని హెచ్చరించారు. పలు ల్యాబ్‌లను తనిఖీ చేశారు. చాలా చోట్ల అసలైన వారు లేకుండా సిబ్బంది టెస్ట్‌లు చేస్తుండడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఇదిలా ఉండగా స్థానిక మున్సిపల్ కార్యాలయ వీధిలోని సీనియర్ ఆర్‌ఎంపీ దిల్షాద్ తన క్లినిక్‌ను అధికారుల ముందే తెరచి ఉంచారు. తనకు 40 ఏళ్ల అనుభవం ఉందని, తాను నొప్పి లేకుండా ఇంజెక్షన్లు వేస్తానని చెప్పడంతో అధికారులు ఆమెపై మండిపడ్డారు.

ఆర్‌ఎంపీలకు బ్లాక్ మెయిలింగ్

జిల్లా అధికారులు ఆర్‌ఎంపీలపై దాడులు చేస్తున్న నేపథ్యంలో కొందరు తాము యూట్యూబ్ విలేకరులమంటూ ఆర్‌ఎంపీల వద్దకెళ్లి వారి వీడియోలను తీసి భారీ మొత్తంలో డిమాండ్ చేస్తున్నారంటూ పలువురు ఆర్‌ఎంపీలు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దిల్షాద్ అనే ఆర్‌ఎంపీని సైతం రూ.5వేలు డిమాండ్ చేశారని అధికారులకు తెలిపారు.

బదిలీలకు పకడ్బందీగా కసరత్తు

- డీఆర్‌ఓ పుల్లయ్య ఆదేశం
- నేటి సచివాలయ ఉద్యోగుల కౌన్సెలింగ్ వాయిదా
- బదిలీలకు 1,724 మంది సచివాలయ ఉద్యోగులు దరఖాస్తు


మాట్లాడుతున్న డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీలకు ఆయా శాఖల అధికారులు పకడ్బందీగా కసరత్తు చేయాలని డీఆర్‌ఓ పుల్లయ్య ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయ బదిలీలకు ఈ నెల 30న నిర్వహించాల్సిన కౌన్సెలింగ్ అనివార్య కారణాలతో వాయిదా వేశారన్నారు. అయినప్పటికీ ఆయా శాఖల అధికారులు దీనికి సంబంధించి కసరత్తు ఎలాంటి పొరబాట్లకు తావివ్వకుండా పూర్తి చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయంలోని 16 కేటగిరీల పోస్టులకు గాను ఇప్పటి వరకు 1724 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఇందులో మెడికల్ గ్రౌండ్స్‌లో 114, మ్యూచువల్‌లో 183, మెంటలీ చాలెంజ్డ్ చిల్డ్రన్స్ కేటగిరీలో 9, విభిన్న ప్రతిభావంతుల కేటగిరీలో 32, స్పౌజ్‌లో 93, విజువల్లీ చాలెంజ్డ్‌లో 5, విడో 7, ఇతర కేటగిరీలో 1281 మంది దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. సమావేశంలో డ్వామా పీడీ రాజశేఖర్, ఏఓ కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు బాలాజీకి తెలుగుభాషా పురస్కారం


సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న పలమనేరు బాలాజీ

పలమనేరు: తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా పలమనేరుకు చెందిన ప్రముఖ కవి, జిల్లా రచయితల సంఘ సమన్వయకర్త పలమనేరు బాలాజీ తెలుగుభాషా పురస్కారాన్ని అందుకున్నారు. రచయితగా, కవిగా, కాలమిస్ట్‌గా ఆయన తెలుగుభాషాభివృద్ధి కోసం మూడు దశాబ్దాలుగా ఆయన చేస్తున్న కృషికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది.

చదువులు మళ్లీ కొనసాగించండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రవీంద్రనాథ్, ఎంఈఓలు

పుంగనూరు: 'చదువులకు స్వస్తి పలికిన వాళ్లు మళ్లీ టెన్త్, ఇంటర్‌లో చేరి చదువులను కొనసాగించాలని రాష్ట్ర ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అడ్మిషన్లు ప్రారంభించినట్లు తెలిపారు. పదోతరగతి, ఇంటర్మీడియెట్‌లో చేరడానికి 14 ఏళ్లు నిండిన వారు చదవగలిగి, రాయగలిగిన పరిజ్ఞానం ఉన్న వారు అర్హులన్నారు. సమావేశంలో ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ల్యాబ్ గది చూపిస్తానని మహిళతో అసభ్య ప్రవర్తన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): భర్త అనారోగ్య కారణంగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ఓ మహిళ (21)తో ఆస్పత్రిలో పనిచేసే ఓ వర్కర్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ ఘటన చిత్తూరు ఆస్పత్రిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. అనారోగ్యంతో ఓ వ్యక్తి బుధవారం ఆస్పత్రి ఐసీయూలో చేరాడు. డాక్టర్ల సూచనల మేరకు ఆ వ్యక్తికి బ్లడ్ శాంపిల్స్ తీసి అతని భార్య చేతికిచ్చారు. ల్యాబ్‌లో ఇచ్చి రమ్మన్నారు. దీంతో ఆ మహిళ ల్యాబ్ ఎక్కడుందో తెలియక గాభరా పడుతుండడంతో ఇంతలో వర్కర్ ఎదురయ్యాడు. ల్యాబ్‌కు తీసుకెళుతానని చెప్పి ఆమెతో అతడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆస్పత్రి వర్గాలు గురువారం తెలిపాయి.

పోలీసుల సమస్యలపై సత్వర పరిష్కారం


సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: పోలీసుల సమస్యలను సకాలంలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. పలువురు సిబ్బంది బదిలీలు, సరెండర్ లీవులు, ఇంక్రిమెంట్లు, సస్పెన్షన్ ఎత్తివేత, ఇతర సమస్యలపై ఎస్పీకి వినతి పత్రాలు అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. సస్పెన్షన్ ఎత్తివేత, ప్రోత్సాహకాల పై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. త్వరలోనే బదిలీలు కూడా నిర్వహిస్తామన్నారు. పోలీసుల సంక్షేమమే ప్రధానమని, ఎవరికి ఎలాంటి సమయంలో ఇబ్బందులు వచ్చినా తనను నేరుగా కలిసి తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి మోహన్ రావు, సిబ్బంది దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

మాకు చెక్ వద్దు... జీవనాధారం కల్పించండి

కుప్పం: 'సార్..! మాకు చెక్ వద్దు ..జీవనాధారం కల్పిస్తే చాలు' అని ఓ మృతురాలి కుటుంబ సభ్యులు కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని సెల్వి కుటుంబ సభ్యులు కలిసి వినతి పత్రం ఇచ్చారు. కస్తూర్బా పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న సెల్వి 15 రోజులు క్రితం అనుమానాస్పద స్థితిలో మరణించడం విదితమే. ఈ నేపథ్యంలో కలెక్టర్ ప్రస్తుతం ఆర్థిక సాయంగా మృతురాలి కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల చెక్‌ను అందజేశారు. దీనిని సెల్వి కుమార్తెలు సౌమ్య, అశ్విని, సత్య, కుమారుడు మునిరత్నం చరణ్‌కృష్ణ తిరస్కరించారు. తమ తల్లి మృతితో తాము అనాథలమయ్యామని, తమ తల్లి మృతికి కారణమైన వారిని శిక్షించాలని పైవిధంగా విజ్ఞప్తి చేశారు. అనంతరం కుప్పం డీఎస్పీ పార్థసారథి వారికి కౌన్సెలింగ్ నిర్వహించి లక్ష చెక్‌ను అందజేశారు. సెల్వి కుమారుడికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

నగరికి చేయాలనుకున్నదంతా చేశా

- 40 ఏళ్ల బలిజ సంఘం కలను సాకారం చేశా
- అందరికీ అందుబాటులో ఉంటా
- మాజీ మంత్రి ఆర్కే రోజా


మాజీ మంత్రి రోజాను గజమాలతో సత్కరిస్తున్న బలిజ సంఘ నాయకులు

పుత్తూరు: తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నగరి నియోజకవర్గ ప్రజలకు చేయాలనుకున్నదంతా చేశానని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నిర్మించిన బలిజ సంఘ భవనంలో గురువారం సాయంత్రం నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే బలిజ సంఘ భవన నిర్మాణానికి 9 సెంట్ల స్థలాన్ని కేటాయించినట్లు గుర్తు చేశారు. తాను కులమతాలకు అతీతంగా పనిచేసినట్లు స్పష్టం చేశారు. ఇదే పుత్తూరులో ముస్లిం కోసం షాదీమహల్‌ను అద్భుతంగా నిర్మించామని, మొదలియార్ల కోసం కళ్యాణ మండపం, ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీ, వైఎస్సార్ మున్సిపల్ పార్కు, మున్సిపల్ కార్యాలయం, రెండు అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించామంటూ చేసిన అభివృద్ధిని, తమ ట్రస్ట్ ద్వారా అందించిన, అందిస్తున్న సేవలను వివరించారు.

'ప్రజలు ఇచ్చిన తీర్పు కాదు'

ఇటీవలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ప్రజలు ఓడించలేదని తాను నమ్ముతున్నట్లు ఎన్నికల ఫలితాలపై తన అభిప్రాయాన్ని ఆమె చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, నాయకత్వం ఎలాంటి తప్పులూ చేయలేదని, ప్రజలకు మంచే చేసిందని అన్నారు. తాను ప్రజలందరికీ అందుబాటులోనే ఉంటానని మరోసారి ప్రకటించారు. రోజాను సంఘ నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, సంఘ నాయకులు చక్రి, భానుమతి, మునయ్య, మునిరత్నం, గోపి, రమేష్ పాల్గొన్నారు.